క్లుప్తంగా

మరింత మెరుగైన సేవలు

● దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్



కాళేశ్వరం: గడిచిన 8 రోజుల్లో సరస్వతి పుష్కరాలు వైభవంగా జరిగాయని, రానున్న నాలుగు రోజులు పాటు భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అధికారులకు సూచించారు. గురువారం కాళేశ్వరంలో ఈఓ కార్యాలయంలో కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, దేవస్థానం ఈఓ మహేష్‌లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శైలజా రామయ్యర్ మాట్లాడుతూ రానున్న నాలుగు రోజులు చాలా కీలకమని.. వారాంతపు సెలవులు కావడంతో భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉంటుందన్నారు. అన్ని విభాగాల సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. భద్రత, వైద్యం, రవాణా, తాగునీరు, పారిశుద్ధ్యం, వర్షాలు వల్ల విద్యుత్ సమస్యలు, జాగ్రత్తలు వంటి అంశాలతో పాటు భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక దృష్టి సారించి అన్ని విభాగాల అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ పుష్కరాల నిర్వహణకు సంబంధించిన ప్రస్తుత పరిస్థితులపై వివరిస్తూ, అవసరమైన చోట అదనపు అధికారులు, సిబ్బంది, మెడికల్ టీమ్స్ మోహరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

'పుట్ట మధుకు మతి భ్రమించింది'



కాళేశ్వరం: బీఆర్ఎస్ నాయకుడు పుట్ట మధుకు మతి భ్రమించిందని రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన కాంగ్రెస్‌పార్టీ నాయకులతో కలిసి హరితహోటల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాపు, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు రాజబాపు, మాజీ జెడ్పీటీసీ మాజీ ఎంపీపీ బందెల సత్తమ్మ, జిల్లా కాంగ్రెస్‌పార్టీ ప్రధానకార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి మాట్లాడుతూ.. సరస్వతి నది పుష్కరాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తుంటే కళ్లు చూసి ఓర్వలేక ఆరోపణలు చేస్తున్నారన్నారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు. తమ పార్టీ ఎంపీ వంశీకృష్ణ గురించి బీఆర్ఎస్ పార్టీ నాయకులకు ఎందుకు అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మమత, మెంగాని అశోక్, విలాస్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, సమ్మయ్య, కటకం అశోక్, సాంబయ్య, బాపు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి వేడుకలు




టేకుమట్ల: మండల కేంద్రంతో పాటు, మండలంలోని గ్రామాల్లో గురువారం హనుమాన్ జయంతి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలను నిర్వహించి, భజన కీర్తనలు ఆలపించారు. అలాగే హనుమాన్ మాలధారులు విరమణ చేసి, భజనలు చేశారు. అనంతరం ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

వర్షానికి కూలిన ఇల్లు



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని ప్రధాన రహదారిలో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి ఈదులపల్లి శాంతిశ్రీకి చెందిన పాత ఇల్లు కూలింది. గురువారం పంచాయతీ సిబ్బంది కూలిన గోడలను తొలగించారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం



రేగొండ: ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధమైన ఘటన మండలంలోని తిరుమలగిరిలో చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. మండలంలోని తిరుమలగిరి గ్రామానికి చెందిన మల్యాల సదయ్య ఇల్లు విద్యుదాఘాతంతో గురువారం తెల్లవారుజామున దగ్ధమైంది. దీంతో ఘటన స్థలాన్ని తహసీల్దార్ శ్వేత సందర్శించి నష్టాన్ని ప్రాథమిక అంచనా వేశారు. ఆమె వెంట ఆర్ఐ భరత్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

నాసిరకం విత్తనాలతో జాగ్రత్త..

● పంట దిగుబడిలో విత్తన ఎంపిక కీలకం
● రైతులు అప్రమత్తత అవసరం



టేకుమట్ల: వ్యవసాయ రంగం అనేక ఆర్థిక వ్యవస్థలకు వెన్నముకగా నిలుస్తుంది. కానీ నేడు మార్కెట్‌లో నకిలీ విత్తన మాఫియా రాజ్యమేలుతూ రైతులను ఆర్థికంగా తీవ్ర నష్టాలకు గురి చేస్తుంది. నాణ్యమైన పంటల దిగుబడికి విత్తన ఎంపికే కీలకంగా మారింది. నకిలీ విత్తనాల నియంత్రణకు వ్యవసాయాధికారులు నిరంతరం రైతులకు అవగాహన కల్పిస్తున్న రైతులను పలువురు దళారులు మోసం చేస్తునే ఉన్నారు. జిల్లాలో విత్తన విక్రయ డీలర్లు 391 ఉన్నాయి. కావున వాటి నుంచి మాత్రమే రైతులు విత్తనాలను కొనుగోలు చేయాలని అధికారులు సూచిస్తున్నారు.

నకిలీ విత్తనాల వల్ల ముప్పు..

వ్యవసాయ రంగంలో కలిగిస్తున్న ప్రధాన ఆందోళన నకిలీ విత్తనాలు. నకిలీ విత్తనాల వల్ల పంట దిగుబడి, నాణ్యత, జన్యు సమగ్రతను కలిగి ఉండవు. ఎదుగుదల లేని అంకురోత్పత్తి, నాణ్యత లేని మొక్కల ఎదుగుదల వంటి లక్షణాలు కనిపిస్తాయి. దీంతో రైతులకు కనీసం పెట్టుబడి కూడా రాలేని పరిస్థితి నెలకొని ఆర్థికంగా నష్టపోతాడు.

నకిలీ విత్తనాల నియంత్రణలో అధికారుల పాత్ర

మార్కెట్‌లోని నకిలీ విత్తనాల నియంత్రణకు వ్యవసాయాధికారుల పాత్ర కీలకంగా ఉంటుంది. నకిలీ విత్తనాల ఉత్పత్తి, వాటి నియంత్రణకు కఠినమైన నిబంధనలు అమలు చేయాలి. నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించేలా చర్యలు తీసుకోవాలి. ప్రమాణాలకు అనుగుణంగా అమలు చేసేందుకు రెగ్యులేటరీ సంస్థలు, విత్తన కంపెనీలు, పంపిణీ దారులను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలి. నకిలీ వత్తనాల వల్ల కలిగే నష్టాలపై రైతులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలి.

రైతులు తీసుకోవల్సిన జాగ్రత్తలు

● లూజుగా ఉన్న సంచులలో ఉన్న విత్తనాలను రైతులు కొనుగోలు చేయొద్దు
● అనుమతి పొందిన విత్తన డీలర్ వద్దనే విత్తనాలను కొనుగోలు చేయాలి.
● విత్తనాల కొనుగోలు సమయంలో ప్యాకెట్‌పై ఉన్న తయారీ తేదీ, కాలం ముగిసిన తేదీనీ తప్పనిసరిగా చూసుకోవాలి.
● విత్తనాలను కొనుగోలు చేసినుప్పుడు రసీదు తీసుకోవాలి.
● ఇతర రాష్ట్రాల నుంచి అనుమతి లేకుండా దిగుమతి చేయబడిన విత్తనాలను కొనుగోలు చేయొద్దు.

నాణ్యమైన విత్తనాలను విక్రయించాలి



మాట్లాడుతున్న ఏఓ సతీశ్‌కుమార్

భూపాలపల్లి రూరల్: వర్షకాలం పంటలకు విత్తనాలు, ఎరువులను నాణ్యమైనవి, ఎమ్మార్పీకి విక్రయించాలని ఏఓ సతీష్‌కుమార్ ఫర్టిలైజర్ డీలర్లకు సూచించారు. జిల్లా కేంద్రంలో భూపాలపల్లి మండల డీలర్లతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీలర్లు ప్రభుత్వ నిబంధనలు తప్పకుండా పాటించాలని లేదంటే చర్యలు తప్పవన్నారు. ప్రతి రైతుకు తప్పనిసరిగా రసీదు ఇవ్వవాలన్నారు. భూపాలపల్లి ఫర్టిలైజర్ల డీలర్లు పాల్గొన్నారు.

చర్యలు తీసుకుంటాం..



రైతులు విత్తనాలను కొనుక్కునే సమయంలో ఎవరైన విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేయడంతో పాటు, షాప్ సీజ్ చేస్తాం. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటాం.

- వీరునాయక్ , జిల్లా వ్యవసాయాధికారి

అవగాహన కల్పిస్తున్నాం..



రైతులు గుర్తింపు పొందిన విత్తన డీలర్ల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలి. అనుమతి లేని దుకాణాల్లో విత్తనాలను, తక్కువ ధరకు వచ్చే అనుమతి లేని విత్తనాలను కొనుగోలు చేయొద్దు. ఈ మేరకు రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

- కల్యాణి, మండల వ్యవసాయాధికారి, టేకుమట్ల

గాలివానతో ఆగమాగం



వజినపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యంపై పరదాలు కప్పుతున్న మహిళ రైతు

● కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం
● ఇబ్బందులు పడుతున్న రైతులు

భూపాలపల్లి రూరల్: మండలంలో బుధవారం రాత్రి, గురువారం కురిసిన వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడిసి ముద్దయింది. ధాన్యం కుప్పలపై పరదాలు కప్పుతున్నప్పటికీ ధాన్యం తడిఆరక పోవడంతో మొలకెత్తే పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నాను. ఇప్పటికే రుతుపవాణలు కేరళను తాకినట్లు వాతావారణ శాఖ తెలిపింది. దీంతో ప్రభుత్వం ఏలాంటి నిబంధనలు లేకుండా తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు వాపోతున్నారు. లేదంటే మరోరెండు మూడు రోజులు వర్షాలు కురిస్తే ధాన్యాన్ని కేంద్రాల్లోనే వదిలేయాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కొత్తపల్లిలో బస్తాలపై కప్పిన పరదాలు

ప్రభుత్వం ఆదుకోవాలి



150 బస్తాల్లో ధాన్యం నింపి పెట్టాను. పరదాలు కప్పినప్పటికీ వానకు భూమి తడితో బస్తాల అడుగు భాగంతో మొలకలు వచ్చే ప్రమాదం ఉంది. కేంద్రాల్లో ధాన్యం అలాగే ఉంది. ప్రభుత్వం ఏలాంటి నిబంధనలు లేకుండా తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి.

- అజ్జు రైతు, కొత్తపల్లి (ఎస్ఎం)

భారత్ విశ్వగురువులా నిలుస్తుంది

● బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్



మాట్లాడుతున్న ఎంపీ రాజేందర్

కాటారం: దేశ ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో భారత్ విశ్వగురువులా నిలుస్తుందని మల్కాజ్‌గిరి బీజేపీ పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ అన్నారు. కాళేశ్వరంలో కొనసాగుతున్న సరస్వతి నది పుష్కరాల సందర్భంగా ఈటల రాజేందర్ సతీమణి జమునతో కలిసి సరస్వతి ఘాట్ వద్ద త్రివేణి సంఘమంలో పుష్కర స్నానం ఆచరించారు. అనంతరం పుష్కరఘాట్ వద్ద మీడియాతో మాట్లాడారు. 20 ఏళ్ల క్రిందట అధికారంలో ఉన్న ప్రభుత్వాల కారణంగా దేశం కొంత వెనకబాటుకు గురైందని ఆరోపించారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మోదీ నేతృత్వంలో దేశ అభ్యున్నతి, ప్రజల సంక్షేమ కోసం కృషి చేస్తుందన్నారు. దేశ రక్షణే ధ్యేయంగా బీజేపీ ప్రభుత్వం అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టిందన్నారు. ఎంపీ వెంట ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, నాయకులు చల్ల నారాయణరెడ్డి, బొమ్మన భాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎంపీ రాజేందర్‌కు సన్మానం

భూపాలపల్లి రూరల్: మల్కాజీగిరి ఎంపీ ఈటల రాజేందర్ సరస్వతీ పుష్కరాలకు గురువారం కాళేశ్వరం వెళ్తున్న సందర్భంగా జిల్లా కేంద్రంలో బీజేపీ నాయకులు కార్యకర్తలు స్వాగతం పలికి శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతల నిశిధర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు కన్నం యుగదీశ్వర్, ఎరుకల గణపతి, బట్టు రవి, దొంగల రాజేందర్, పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

కాటారం: మండల కేంద్రానికి చెందిన పలువురు గురువారం ఎంపీ ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. రఫీ ఆస్పత్రి యజమాని డాక్టర్ రఫి, ఆయన కుటుంబ సభ్యులు, ములుగుపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకుడు అనిల్‌రెడ్డి పార్టీలో చేరగా ఈటల రాజేందర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి, చల్ల నారాయణరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రావు, రంజిత్‌కుమార్, మనోజ్, పూర్ణచందర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ శిక్షణను పరిశీలించిన జేడీ



మాట్లాడుతున్న జేడీ సోమిరెడ్డి

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలను రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి గురువారం పరిశీలించారు. రేగొండ మండలం రంగయ్యపల్లి, భూపాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కేజీబీవీలలోని శిక్షణ కేంద్రాలను పరిశీలించారు. షెడ్యూల్ ప్రకారం శిక్షణ కార్యక్రమాలు పూర్తిచేయాలని, ఉపాధ్యాయులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని జేడీ సూచించారు. జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి రాజేందర్, కోఆర్డినేటర్లు లక్ష్మణ్, రమేష్, రాజగోపాల్, ఎంఈఓలు ప్రభాకర్, దేవా తదితరులు పాల్గొన్నారు.

నవరత్నమాల హారతి అద్భుతం

● రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

కాళేశ్వరం: సరస్వతీ నది పుష్కరాల్లో నిర్వహిస్తున్న నవరత్నమాల హారతి అద్భుతమని రాష్ట ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ పుష్కరాల పవిత్రతను, మహత్యాన్ని వివరించేందుకు ప్రతి రోజు కాశీ పండితులతో ఘనంగా సరస్వతి నవరత్న మాల హారతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పుష్కరాలను విజయవంతంగా నిర్వహిస్తున్న అధికారులను అభినందించారు. సరస్వతి పుష్కరాలు మే 26 వరకు కొనసాగనున్న నేపథ్యంలో భక్తులు పెద్దఎత్తున తరలివచ్చే అవకాశం ఉందని, అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే పాల్గొన్నారు.

'సౌకర్యాలు కల్పించడంలో విఫలం'

● మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

కాటారం: పన్నెండేళ్లకు ఒకసారి వచ్చే సరస్వతి నది పుష్కరాల్లో ప్రభుత్వం సౌకర్యాలు కల్పిచడంలో విఫలమైందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు,శైలజ దంపతులు గురువారం కాళేశ్వరంలోని సరస్వతి నది పుష్కరాల్లో భాగంగా సరస్వతి ఘాట్ వద్ద త్రివేణి సంఘమంలో పుష్కర స్నానం ఆచరించారు. అనంతరం పుష్కరఘాట్ వద్ద పుట్ట మధు విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వ చేతకానితనంతో పుష్కరాలు విఫలమయ్యాయని అన్నారు. పుష్కరాల్లో సరైన ఏర్పాట్లు, సౌకర్యాలు లేక భక్తులు, విధులు నిర్వర్తించడానికి వచ్చిన అధికారులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులుపడుతున్నారని పేర్కొన్నారు. పుష్కర స్నానానికి వచ్చిన భక్తులు, సాధువులు ప్రభుత్వ ఏర్పాట్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. పుష్కరాల విధులు నిర్వర్తిస్తూ వడదెబ్బతో పారిశుద్ధ్య కార్మికుడు దళితుడైన మంతెన శ్రీనివాస్ మృతి చెందితే ప్రభుత్వం, మంత్రి పట్టించుకోకపోవడం శోచనీయం అన్నారు. ఈ సంఘటనతో మంత్రికి దళితులపై ప్రేమ ఎంత ఉందో అర్థం అవుతుందని విమర్శించారు. మంతెన శ్రీనివాస్ కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని అన్నారు. అలాగే దళితబిడ్డ పెద్దపల్లి ఎంపీ వంశీపై కులవివక్ష చూపి ప్రోటోకాల్ కల్పించకుండా అవమానించారని దీనికి ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజారామయ్యార్ పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ రాష్ట నాయకుడు జక్కు రాకేశ్, గీతాబాయి, నాయకులు జవ్వాజి తిరుపతి, వెన్నపురెడ్డి వసంత, మోహన్ రెడ్డి, జోడు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి



చిట్యాల: విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని చింతకుంట రామయ్యపల్లిలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సమ్మయ్యకు చెందిన దుక్కిటెద్దును మేతకోసం పొలాలవైపు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో దుక్కిటెద్దు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి షాక్‌గురై అక్కడికక్కడే మృతి చెందింది. దుక్కిటెద్దు విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

భక్తులకు తప్పని తిప్పలు



శివుడి విగ్రహం వద్ద నీటిలో నిల్చుని ఫొటోలు దిగుతున్న భక్తులు

చిట్యాల: కాళేశ్వరం సరస్వతి నది పుష్కరాలకు వచ్చిన భక్తులకు తిప్పలు తప్పడం లేదు. బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షం కారణంగా భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పుష్కరఘాటు వద్ద ఏర్పాటు చేసిన ఆర్టిఫిషియల్ శివుడి విగ్రహం వద్ద వరద నీరు నిలిచింది. దీంతో భక్తులు విగ్రహం వద్ద మొక్కులు చెల్లించడానికి, ఫొటోలు దిగడానికి గురువారం ఇబ్బందులు పడ్డారు.

తరలివచ్చిన అంజన్న మాలధారులు



భూపాలపల్లి అర్బన్: హన్‌మాన్ జయంతిని పురస్కరించుకొని గురువారం అంజన్న మాలధార స్వాములు కాళేశ్వరానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. వివిధ జిల్లాల నుంచి కాళేశ్వరంలో హన్‌మాన్ దేవాలయం, రామాలయాల్లో మాల విరమణ చేసిన అనంతరం త్రివేణి సంగమంలో సరస్వతి పుష్కర ఘాట్ వద్ద పుష్కర స్నానాలు ఆచరించారు.

లైఫ్ జాకెట్ లేకుండానే ప్రయాణం



భూపాలపల్లి అర్బన్: కాళేశ్వరం పుష్కరాల నేపథ్యంలో త్రివేణి సంఘమంలో లైవ్ జాకెట్ లేకుండానే కొంత మంది భక్తులు గోదావరి అవతలి వైపు పడవల్లో వెళ్లి పుష్కర స్నానాలు చేస్తున్నారు. పడవల నిర్వాహకులు రక్షణ చర్యలు పాటించకుండానే గోదావరిలో పడవలు నడిపిస్తున్నారు. సంబంధిత అధికారులు ఇక్కడే విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

ప్రమాదకరంగా రోడ్డు



చిట్యాల: కాళేశ్వరంలోని బస్టాండ్ నుంచి పుష్కర ఘాట్ వరకు వెళ్లే రహదారి బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పలు చోట్ల కోతకు గురై ప్రమాదకరంగా మారింది. అటుగా వెళ్తున్న వాహనాలు ఇబ్బందులు పడుతూ వెళ్లాల్సి వస్తుంది. సంబంధిత అధికారులు కోతకు గురైన రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేయాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

ప్రసాదాల కౌంటర్ల వద్ద భక్తుల రద్దీ



భూపాలపల్లి అర్బన్: కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయ సమీపంలోని లడ్డు, ప్రసాదాల కౌంటర్ల వద్ద గురువారం భక్తుల తాకిడి పెరిగింది. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రెండు లడ్డులకు రూ.50, పులిహోర ప్యాకేట్ రూ.15లకు విక్రయాలు చేపడుతున్నారు. ప్రసాదాలు కొనుగోలు చేసేందుకు భక్తులు క్యూ లైన్‌లో బారులుదీరారు.

రోడ్డుకు మరమ్మతులు



చిట్యాల: కాళేశ్వరం సరస్వతి నది ప్రధాన ఘాట్ నుంచి పుష్కర ఘాటుకు వెళ్లే దారిలో భారీ వర్షానికి రోడ్డు బురదమయం అయింది. దీంతో అధికారులు బురదమయమైన రోడ్డుపై గురువారం కంకర పోసి మరమ్మతులు చేపట్టారు.



సరస్వతి పుష్కర ఘాట్ వద్ద ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి

మిషన్లతో ఎంతో మేలు



పలిమెల: కరెంట్‌తో మొక్కజొన్న కంకులు కాల్చే, ఉడికించే మిషన్లు మహిళా ఔత్సాహికులకు ఎంతో మేలని మధుగురు ఇన్నోవేషన్ ఆర్గనైజర్ మధుకర్ అన్నారు. కాళేశ్వరంలోని సరస్వతి నది పుష్కరాల్లో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లలో మధుగురు ఇన్నోవేషన్ అవగాహన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మధుగురు ఇన్నోవేషన్ పరికరాలతో మహిళలు, యువత, రైతులకు ఆర్థిక సాధికారత సాధించాడికి ఎంతో మేలన్నారు. ఔత్సాహికులకు సుమారు 100 రోజుల పాటు శిక్షణ ఇచ్చి బీజినెస్ సెంటర్ల గుర్తించి వారిని ప్రోత్సాహిస్తామన్నారు.

షటిల్ బస్సుల పునరుద్ధరణ

కాటారం: పుష్కరాల్లో భాగంగా భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఉచిత షటిల్ సర్వీస్ బస్సులు గురువారం ఉదయం నుంచి తిరిగి నడుస్తున్నాయి. తాత్కాలిక బస్టాండ్ నుంచి సరస్వతి ఘాట్ వరకు, అక్కడి నుంచి ప్రధాన దేవాలయం వరకు భక్తులను ఉచితంగా రవాణా చేయడం కోసం సింగరేణి ఆధ్వర్యంలో షటిల్ బస్సులను ఏర్పాటు చేశారు. బుధవారం కురిసిన వర్షం కారణంగా బస్సుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో కలెక్టర్ రాహుల్‌శర్మ, ఇతర అధికారులు భక్తులకు ఇబ్బందులు కల్గకుండా తిరిగి బస్సుల సేవలను పునరుద్ధరించార

పెట్రోల్ కష్టాలు

పలిమెల: పుష్కరాల్లో పెట్రోల్ దొరకక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కాళేశ్వరంలో పెట్రోల్ బంకు లేకపోవడంతో పలువురు దుకాణదారులు పెట్రోల్‌ను క్యాన్లలో తీసుకువచ్చి లీటర్ రూ.130 కి విక్రయిస్తు సొమ్ముచేసుకుంటున్నారు. దగ్గరలో పెట్రోల్ బంకులు లేకపోవడంపై పలువురు వాహనదారులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు.